



గుంటూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో.. దీపారాధన

కార్తిక దీపాల వెలుగుల్లో శైవక్షేత్రాలు


అమరావతి: క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు


వినుకొండ: శివాలయంలో కార్తిక దీపారాధన చేస్తున్న మహిళలు


మాచర్ల: రామప్ప దేవాలయంలో దీపోత్సవం


అమరావతి/పెదకాకాని, నరసరావుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం రెండవ సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసాయి. మహిళలు, మాలధారులు తెల్లవారు జామునే ఆలయాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లో ప్రదక్షిణలు చేసి.. స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో మహిళలు దీపారాధనలు చేశారు. బాలచాముండికా సమేత అమరేశ్వరాలయానికి.. పంచరామక్షేత్రాల సందర్శన భక్తులు ఆదివారం రాత్రే చేరుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం 4 గంట ల నుంచే భక్తులు క్యూలైన్‌లలో బారులు తీరారు.

పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ

పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజామున నుంచే భక్తులు యజ్ఞాల బావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక మాస దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.7 లక్షల ఆదాయం వచ్చినట్లు లీలాకుమార్ తెలిపారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఐజీ కొడాలి పుష్పలత స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తిక పౌర్ణమి భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం ఉద యం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహన పూజలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. పౌర్ణమి పర్వదినం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వ హించను న్నట్లు వెల్లడించారు.

కోటప్పకొండలో భక్తుల కోలాహలం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ చేశారు. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది.




అమరావతి: కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు


పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ



సీసీఐ ఇంకాస్త మెత్తబడాలి

- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు
- తుఫాన్ వేళ..ఎలా సాధ్యమంటూ రైతుల ఆందోళన
- తేమ శాతం పెంచాలంటూ విజ్ఞప్తి
- కేంద్రం కల్పించిన వెసులు బాటు ప్రస్తావన

మొంథా తుఫాన్ వల్ల పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయిన పత్తి రైతులతో సీసీఐ (కాటన్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా) ఆడుకుం టోంది. 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని పట్టుబడు తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ఆరంభించిన కొనుగోలు కేంద్రాల్లో భారీగా గొడ వలు జరుగుతున్నాయి. వాతావరణం అంతా తేమతో ఉంటే పత్తి పొడిగా ఎలా ఉంటుంది..? అంటూ రైతులు బయ్యర్లతో వాగ్వివాదానికి దిగు తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితిని బట్టి ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్‌ఏ క్యూ) నిబంధనలు మార్చుకోవచ్చు అన్న కేంద్ర క్యాబినెట్ ఉత్తర్వులపై చర్చ ఆరంభమైంది. 2014 మేలో కేంద్రం విడుదల చేసిన మద్దతు ధర పథకం (ప్రైస్ సపోర్టు స్కీం, పీఎస్ఎస్) గైడ్ లెన్స్‌ను కొందరు ప్రస్తావిస్తున్నారు.

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

మద్దతు ధర పథకం గైడ్ లెన్స్ చాప్టర్-2 తుఫాన్‌లు తరచుగా సంభవించే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు మేలు చేసే అంశాలను ప్రస్తావించింది. ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) నిబంధనలను అసాధారణ పరిస్థితిలో కేంద్ర వ్యవసాయ శాఖ అనుమతి తో మార్చుకునే అవకాశం ఉంది. అది కూడా అసాధారణ పరిస్థితి ఏర్పడిన ప్రాంతం వరకు ఈ మినహాయింపు ఇచ్చే అధికారం కేంద్ర వ్యవసాయ శాఖకు ఉంటుంది. ఈ లెక్కన సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాను తాకిడి ఎక్కువగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో ఫెయిర్ యావరేజ్ క్వాలిటీలో మొట్ట మొదటిగా చెప్పబడే తేమ శాతాన్ని పెంచి.. కొనుగోలు చేసే అవకాశం స్పష్టంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు తీసుకువస్తున్న పత్తిలో తేమ శాతం 15 నుంచి 20 వరకు ఉంటుందని (మిగతా 7వ పేజీలో)

ఇదేమి చోద్యం!

- శిక్షణలో ఉద్యోగోన్నతి పొందిన ఎంపీడీఓలు
- వారి డిజిటల్ సిగ్నేచర్‌తో 'ఉపాధి' బిల్లులు అప్‌లోడ్
- నిబంధనలకు విరుద్ధమైనా.. పట్టించుకునేవారేరీ ?
- ఏడు మండలాల్లో.. రూ.8.66 కోట్లు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం బిల్లుల ప్రక్రియలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. మెటీరియల్ బిల్లుల అంశంలో కొందరు అధికారులు నిబంధనలను తుంగ లో తొక్కారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బిల్లులను అప్‌లోడ్ చేయడంలో శిక్షణలో ఉన్న మండల ప్రజా పరిషత్ అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఏడు మండలాల్లో రూ.8.66 కోట్ల విలువైన బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది.

శిక్షణలో ఉండగానే... బిల్లులు అప్‌లోడ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 16 మంది విధుల నిర్వహణపై బాపట్లలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సదరు అధికారుల స్థానంలో పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల నుంచి ఇన్‌చార్జిల (ఎఫ్ఏసీ)ను నియమించారు. ఎంపీడీవోలు పని చేస్తున్న చోట నుంచి రిలీవ్ అయి శిక్షణకు హాజరయ్యారు. వీరు శిక్షణలో ఉండగానే అయా మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి మెటీరియల్ బిల్లులను అప్‌లోడ్ చేశారు. డీఎస్(డిజిల్ సిగ్నేచర్) వారి వద్ద ఉన్నా దానిని శిక్షణ కాలంలో వినియోగించరాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. నిబంధనలకు


సీసీ రోడ్డు నిర్మాణం (పాత చిత్రం)

విరుద్ధంగా కొందరు డీఎస్‌లను వినియోగించి బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఉపాధి పనుల్లో బిల్లుల అక్రమాలపై మండలాల వారీగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరు గుతోంది. బిల్లుల ప్రక్రియలో నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్న వాదన వినిపిస్తోంది. ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా ఉన్నతాధికారులు శిక్షణ కాలంలో ఏ మండలంలో ఎంత మేర బిల్లులు ప్రక్రియ పూర్తి చేశారన్న అంశంపై దృష్టి సారిస్తే జరిగిన అవకత వకలు వెలుగుచూసే అవకాశం ఉంది.

నలుగురు విద్యార్థులు.. ఆరుగురు ఉపాధ్యాయులు

- లూథరన్ పాఠశాలలో ఆర్జేడీ విచారణ

యడ్లపాడు, నవంబరు 3 : యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) ఎల్ లింగేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. గతంలో పాఠశాల మూసివేతకు, రికార్డులు అప్పగింతకు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ విద్యాశాఖకు రికార్డులు అప్పగించకపోవడం, తిరిగి విద్యార్థులు ఉన్నారని రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలంటూ



యాజమాన్యం లేఖ రాయడంతో క్షేత్రస్థాయి విచారణకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులే ఉండగా వారికి బోధించేందుకు శాశ్వత ప్రాతిపదికన పనిచేసే హెచ్‌ఎం, ఇద్దరు ఎస్‌జీటీలు, జూ నియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండరు ఉన్నట్లు గుర్తించామన్నారు. జోన్లవారీగా మిగులు ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారో గుర్తిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం ఈ అదనపు ఉపాధ్యాయులను లూథరన్ సంస్థ పరిధిలోని ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా లూథరన్ యాజమాన్యం చర్యలు తీసుకోలేదని, దీనితో తాను స్వయంగా పరిశీలించి సర్దుబాటు విషయాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకు చూస్తున్నామని స్పష్టం చేశారు. దాదాపు ఐదు నెలలుగా ఈ ఆరుగురు (ఉపాధ్యాయులు, సిబ్బంది) ఖాళీగా ఉన్న మాట వాస్తవమే అని ఆయన ధ్రువీకరించారు. పిల్లలు ఉన్నారా.. వారికి సరిపడ సిబ్బంది ఉన్నారా.. అదనంగా ఉంటే వారి పరిస్థితి ఏమిటి.. వారిని ఎక్కడకు బదిలీ చేయాలనే ఉద్దేశంతోనే తాము పరిశీలన జరుపుతున్నామని చెప్పారు. పూర్తి పరిశీలన తరువాత తదుపరి నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.

నిశీధిలో మృత్యుఘోష


ఘటనా స్థలంలో కంటైనర్, కారు


శ్రీనివాసరాజు | బేతాళం లక్ష్మీ | బలరామరాజు | పుష్పవతి

లారీని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన కారు

- నలుగురు మృత్యువాత.. అందరూ బంధువులే
- గాయాలతో బయటపడిన ఇద్దరు చిన్నారులు
- ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా కర్లపాలెం వద్ద దుర్ఘటన

కర్లపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాపట్లలోని బంధువుల శుభకార్యానికి వెళ్లిన కుటుంబం తిరుగు ప్రయాణం తిరిగిరాని లోకాలకు సాగింది. నిశీధిలో ఎదురుగా కంటైనర్ రూపంలో వచ్చిన మృత్యువు నలుగురిని కబళించింది. ఈ దుర్ఘటనలో కారులో నలుగురు పెద్దలు మృతి చెందగా.. ఇద్దరు చిన్నారులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పంచాయతీలోని సత్యవతిపేట జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాద స్థలం వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కర్లపాలెంలోని సినిమా హాలు వెనుక బజారులో నివాసం ఉంటున్న బేతాళం బలరామరాజు, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల శుభకార్యానికి బాపట్ల వెళ్లారు. పంక్షన్‌లో ఆనందంగా గడిపి ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి మూడు కార్లల్లో తిరుగు ప్రయాణమయ్యారు. బలరామరాజు, లక్ష్మీ ప్రయాణిస్తున్న కారులో వారి చిన్న కుమార్తె (మిగతా 7వ పేజీలో)

నలుగురూ బంధువులే..

బేతాళం బలరామరాజు, లక్ష్మీలది వ్యవసాయ కుటుంబం. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె వాణి, భర్త వేణు, మనవరాళ్లు భావన, దీపికలు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. చిన్నకుమార్తె గాదెరాజు మాధవి, భర్త అనీల్‌కుమార్ వర్మ పైలెట్‌గా ఉద్యోగం చేస్తూ ఉదయపూర్‌లో ఉంటున్నారు. గాదెరాజు పుష్పవతి బలరామరాజుకు వియ్యపురాలు. చిన్నకుమార్తెను పుష్పవతి కుమారుడికి ఇచ్చి వివాహం చేశారు. ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు పుష్పవతి కోడలు మాధవి, మనవడు జయంత్, మనవరాలు వైష్ణవిలను తీసుకొని గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి ముదునూరి శ్రీనివాసరాజు కారులో నేరుగా బాపట్లకు వెళ్లారు. విజయవాడకు చెందిన శ్రీనివాసరాజుకు ఒక్కడే కుమారుడు. అతనికి ఈ నెల 26న వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి, అంత్యక్రియలను దగ్గరుండి చూసుకున్నారు.

నరసరావుపేటలో కట్టుతప్పుతున్న టీడీపీ శ్రేణులు

- ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు
- తాజాగా మరో మైనార్టీ నేత వీడియో వైరల్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

నరసరావుపేట నియోజకవర్గంలో టీడీపీ నేతలు కట్టు తప్పుతున్నారు. ఒకరిపై ఒకరు బహిరంగంగా విమర్శలు చేసు కుంటున్నారు. ఎరువుల పంపిణీలో కూడా వాగ్వివాదాలకు దిగిన ఘటనలున్నాయి. తాజాగా టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ నేత మహమ్మద్ ఉమర్ పార్టీ లోని కొందరు నేతలను విమ ర్శిస్తూ సోమవారం వీడియో విడుదల చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముగ్గురు నేతలపై తీవ్రస్థాయిలో ఆయన మం డిపడ్డారు. ఆయన విమర్శలు పార్టీలో చర్చనీయాంశమ య్యాయి. పరిస్థితులను చక్క దిద్దాల్సిన నేతలు చోద్యం చూస్తున్నారన్న (మిగతా 7వ పేజీలో)



సూర్యలంక సముద్రతీరంలో కార్తిక పౌర్ణమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తదితరులు

సూర్యలంకలో..

కార్తిక పౌర్ణమి ఏర్పాట్లు

పరిశీలించిన ఆర్డీవో, అధికారుల బృందం

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమిరోజు పుణ్యస్నానాలు ఆచరించటానికి సూర్యలంక సముద్రతీరానికి విచ్చేసే భక్తులకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం షవర్‌బాత్‌లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మొబైల్ టాయిలెట్స్, అదనపు లైటింగ్ సౌకర్యాలు వేగవంతంగా ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నాటికి వసతులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ సిబ్బందితో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్తికమాసం ప్రారంభం నుంచి ఈ ఏడాది వర్షాలు, తుఫాన్ వంటి విపత్తులు సంభవించటంతో మంగళవారం వరకు బీచ్ లో రాకపోకలు నిషేధించారు. కార్తిక పౌర్ణమి రోజు భక్తులను అనుమతించాలని ఆలోచనతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా పార్కింగ్ ఏరియాలో పెద్దఎత్తున నిలిచిపోయిన వర్షపునీటిని బయటకు తరలించే ఏర్పాటు చేశారు. ప్రకృతి అనుకూలిస్తే పౌర్ణమి రోజు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నివసతులు సమకూర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది కలిసి మొబైల్ టాయిలెట్‌లు, తాత్కాలిక స్నానాల గదులు ఏర్పాట్లు చేయించారు.

గుంటూరులో.. సాయి భక్తులు లేరా?



ఏటా ప్యాసింజర్ రెవెన్యూ రూపంలో రైల్వేకు రూ. 110 కోట్ల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నా గుంటూరు రైల్వే డివిజన్‌కు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడి దాదాపుగా రెండు దశాబ్దాలు గడిచి హెడ్‌క్వార్టర్‌గా గుంటూరు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో గుర్తింపు ఇవ్వని పరిస్థితి. గతంలో ప్రత్యేక రైళ్లు అనగానే అన్ని వేరే మార్గాల్లో మంజూరు చేసేవారు. ఇప్పుడు గుంటూరు మీదగా నడుపుతున్నా కొన్నింటికి హెడ్‌క్వార్టర్స్ అయిన గుంటూరు జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

- సత్యసాయి ఉత్సవాల ప్రత్యేక రైళ్లకు ఇక్కడ నో స్టాపేజీ
- రూ. 110 కోట్ల ఆదాయం ఇస్తున్నా డివిజన్‌పై చిన్నచూపు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అనేక ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నడపబోతున్నది. సత్యసాయి బాబా భక్తులు గుంటూరు జిల్లాలో అనేక మంది ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ప్రత్యేక రైళ్లకు ఇక్కడ స్టాపేజీ ఇవ్వకపోవడాన్ని సోమవారం పలువురు రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లారు.

నంబరు. 08335/08336 సంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ - సంబల్‌పూర్ ప్రత్యేక రైళ్లు ఈ నెల 20, 24 తేదీల్లో గుంటూరు మీదగా ప్రయాణించనున్నాయి. అలానే నంబరు. 08445/08446 కటక్ - బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ ప్రత్యేక రైళ్లు ఈ నెల 21, 25 తేదీల్లో, నంబరు. 08463/08464 భువనేశ్వర్ - బెంగళూరు కంటోన్మెంట్ - బెంగళూరు రైళ్లు ఈ నెల 16, 20 తేదీల్లో, నంబరు. 08553/08554 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు రైళ్లు ఈ నెల 21, 24 తేదీల్లో గుంటూరు మీదగా ప్రయాణించనున్నాయి. అయితే ఈ ఎనిమిది రైళ్లకు ఈస్టు కోస్టు రైల్వే జోన్ గుంటూరులో నిలుపుదల ఇవ్వలేదు.

ఎన్ఎస్‌జీ-2 కేటగిరీలో ఉన్నప్పటికీ....

నాన్ సబర్బన్ గ్రూపు-2 కేటగిరీలో గుంటూరు రైల్వేస్టేషన్ ఉన్నది. ఈ ప్రత్యేక రైళ్లు గుంటూరు - నంద్యాల మార్గంలో ప్రయాణిస్తాయి. ఈ మార్గంలో కొంత భాగం మినహా అంతా డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ సదుపాయాన్ని కలిగివుంది. అయినప్పటికీ గుంటూరు లాంటి మేజర్ రైల్వే జంక్షన్‌లో నిలుపుదల కల్పించకుండా టైంటేబుల్‌ని ఈస్టు కోస్టు రైల్వే విడుదల చేసింది. దీనికి ఇక్కడి నుంచి అభ్యంతరం పెట్టకపోవడం ఏమిటని రైల్వే వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. గుంటూరు కంటే తక్కువ కేటగిరీ స్టేషన్లుగా ఎన్ఎస్‌జీ-4లో ఉన్న గుత్తి, ధర్మవరానికి హాల్టింగ్ సదుపాయం కల్పించి ఇక్కడ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎనిమిది రైళ్లకు గుంటూరుతో పాటు మార్కాపురం రోడ్డులోనూ స్టాపేజీ కల్పించాలని ఈ-మెయిల్స్ పంపించారు. దీనిపై ఈస్టుకోస్టు రైల్వే ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

శిథిలావస్థలో.. సీటీ శాఖ కార్యాలయం

నిలిచిన నిర్మాణ పనులు

చుట్టుగుంట సెంటర్‌లో నిర్మాణ దశలో ఉన్న వాణిజ్యపన్నులశాఖ (సీటీ శాఖ) కార్యాలయ భవన నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ఈ భవ న నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు తీరుతాయనుకున్న ఆ శాఖ ఉద్యోగుల ఆశలు అడి ఆశలయ్యాయి. భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవటంతో పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. ఈ నిర్మాణం పూర్తయితే రూ లక్షల నిధులు ప్రభుత్వానికి ఆదా అయ్యేది. వైసీపీ ప్రభుత్వం రాకతో భవన నిర్మాణం అటకెక్కింది.

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖ గుంటూరు-1, 2 డివిజన్‌లు ప్రస్తుతం గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర కాంప్లెక్స్ భవనంలో ఉన్నాయి. దశాబ్దకాలం పై నుంచి అక్కడే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. డివిజన్ కార్యాలయాలతోపాటు పలు సర్కిల్స్ కార్యాలయాలు కూడా ఉన్నాయి. తద్వారా నెల నెలా రూ. లక్షలు అద్దె రూపంలో సదరు భవన యజమానులకు చెల్లిస్తున్నారు. వర్షం పడిందంటే చాలు భవనం సెల్లార్‌లో వరద నీటితో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. తరచూ లిఫ్ట్ రిపేర్లతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో 2018లో సీటీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా రాజాబాబు (ప్రస్తుతం ప్రకాశం కలెక్టర్), అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు ఇతర ఎమ్మెల్యేల చొరవతో చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్‌శాఖ స్థలంలో వారి నిధులతో సీటీ శాఖకు భవనం నిర్మించటం, అద్దె రూపంలో మార్కెటింగ్‌శాఖకు చెల్లించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని కూడా ప్రారంభించారు. ఆ తరువాత నిర్మాణ దశలో ఉన్న భవనం కొంత భాగం పూర్తయింది. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రహణం పట్టినట్లయింది. అనంతరం సీటీ శాఖ గుంటూరు జాయింట్ కమిషనర్‌గా వ్యవహరించిన ఓంకార్‌రెడ్డి సదరు భవన నిర్మాణ పనులపై అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. నిర్మాణానికి నిధులివ్వక, కాంట్రాక్టర్‌లు ముందుకు రాక సగ భాగం నిర్మాణ నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది.



శిథిలావస్థకు చేరుకున్న సీటీ శాఖ కార్యాలయం

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు.....

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే శాఖల్లో వాణిజ్యపన్నులశాఖ ఎంతో కీలకమైనది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే సీటీ శాఖకు సొంత కార్యాలయ భవనం లేకపోవటంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలకు రూ. లక్షలు చెల్లిస్తూ ఖజానాకు గండి పడుతున్నా ఉన్నతాధికారులు సొంత భవనం నిర్మాణ దిశగా ఆలోచన చేయకపోవటం సరికాదని ఉద్యోగులు వాదిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకిరావటంతో సీటీ శాఖ ఉద్యోగులు సొంత భవనంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు సీటీ శాఖ సొంత భవనం నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏఎన్‌యూలో శిల్పాధికారంపై ప్రత్యేక సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నృత్య విభాగం ఆధ్వర్యంలో శిల్పాధికారం అనే అంశంపై సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా తమిళనాడులోని తిరువల్లూరు విశ్వవిద్యాలయం, వెల్లూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.రూప పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, శిల్పాధికారం తమిళ సాహిత్యంలో ఉన్న ప్రాధాన్యాన్ని ఆధునిక విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. వ్యక్తిత్వ నిర్మాణంలో శిల్పాధికారం అనే భావనను ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. ఆర్ట్స్ కళల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ, భాషల మధ్య సమన్వయం అవసరమని అన్నారు. ఇలాంటి వర్క్‌షాపులు విద్యార్థుల అవగాహనను పెంపొందిస్తాయన్నారు. ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ, శిల్పాధికారం తమిళ సాహిత్యంలో వేదానికి సమానమైన విలువ కలిగిందన్నారు. కార్యక్రమంలో తెలుగు, ప్రాచ్య భాషల విభాగం అతిథి అధ్యాపకుడు పవన్, వాసు, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతి నాగభూషణం, మట్టుపల్లి కాశయ్య పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!



విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్ల ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి

కలెక్టరేట్‌లో పురుగు మందు తాగిన రైతు

● తన భూమి ఆక్రమించారంటూ ఆవేదన



పురుగుమందు తాగి పడిపోయిన బాధితుడు

బాపట్ల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన గంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీకు చెందిన మార్పు బెన్ను సోమవారం కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. 1981లో 22 కుటుంబాలకు 56 ఎకరాల భూమిని సర్వే నంబరు 1158లో ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న రైతులు.. ఏడేళ్ల క్రితం ఆ ప్రాంతానికి చెందిన మన్నె సునీల్‌చౌదరి, మన్నె రాధికకు కౌలుకు భూములిచ్చారు. వారు కౌలు సరిగ్గా ఇవ్వకపోగా సర్వే నంబరు 1159గా మార్చి.. విద్యుత్ సర్వీస్ వారి పేరు మీద ఏర్పాటు చేసుకున్నారని బాధితుడు ఆరోపించాడు. చినగంజాం పోలీసులకు, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదంటూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఆయన కలెక్టరేట్ వద్ద పురుగు మందు తాగాడు. దీంతో అక్కడ ఉన్నవారు అతనిని ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలందిస్తున్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

విజయపురిసౌత్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌తండాలో ఓ ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు. నాటుసారాను నిల్వ ఉంచిన బాలునాయక్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 15 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎస్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

'ఎస్ఆర్ఎం'లో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్

● వాంతులు, విరోచనాలతో ఎన్నారైలో విద్యార్థులు
● ఒకరి పరిస్థితి విషమం?
● నెల క్రితం ఇదే ఇబ్బందితో విద్యార్థుల ధర్నా
● ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు కరువు

తుళ్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హాస్టల్‌లోని విద్యార్థులకు సోమవారం ఫుడ్ పాయిజన్ జరిగింది. ఆదివారం హాస్టల్ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. మరుసటి రోజు ఉదయం నుంచే వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. యాజమాన్య సిబ్బంది వారిని ఎన్నారై హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఒక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. అయితే ఈ విషయాన్ని బయటకు రానివ్వొద్దంటూ విద్యార్థులను యాజమాన్యం బెదిరింపు ధోరణితో హెచ్చరించడం గమనార్హం. ఇన్‌స్టాగ్రాంలో విద్యార్థులు కొంతమంది ఈ ఘటనపై పోస్టు చేయడంతో వారిమీద యాజమాన్యం దౌర్జన్యం చేసి, వెంటనే పోస్టులను డిలీట్ చేయించారని తెలిసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. రూ.లక్షలు ఫీజులు కట్టి పిల్లల ఆరోగ్యం దెబ్బతీయడానికా.. యూనవర్సిటీలో చేర్పించామా.. అంటూ ఫోన్‌లో, డైరెక్టుగా యాజమాన్య సిబ్బంది దగ్గరకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువు సంగతి దేవుడెరుగు పిల్లలు చేతికందకుండా పోతారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెల క్రితమే ఆందోళన..

ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో నెల క్రితం విద్యార్థులకు ఇదే విధంగా ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. దీనిని అత్యంత గోప్యంగా ఉంచారు. అప్పట్లో విద్యార్థులు లోపల ధర్నా కూడా చేశారు. అయినా అపరిశుభ్రంగా ఆహార పదార్థాలు తయారు చేయడంతో.. ఇప్పుడు 200 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. హాస్టల్‌కు సంవత్సరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.80లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇంత డబ్బులు తీసుకొని కూడా పరిశుభ్రమైన ఆహారం పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే టీసీలు ఇచ్చి పంపండని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేసినట్లు తెలిసింది.

ఫుడ్ తనిఖీ అధికారుల జాడేది!

వేల మంది విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో చదును అభ్యసిస్తున్నారు. అందులో చాలామంది లోపల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. అంతమంది వంట చేస్తున్న క్యాంటీన్‌ను ఎప్పుడూ ఐదేళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఆహార పదార్థాల నాణ్యతా గురించి ఏ ఒక్కరోజు పట్టించుకోలేదు. తరచూ తనిఖీలు జరుగుతుంటే.. ఇటువంటి దారుణమైన పరిస్థితి ఏర్పడేది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వర్సిటీ మామూళ్ల మత్తులో తనిఖీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మొంథాను సమర్థంగా ఎదుర్కొన్నాం

● సమష్టి కృషి వల్లే సాధ్యమైంది
● తుఫాన్ సేవల సత్కార సభలో కలెక్టర్ కృతికా శుక్లా



ఆర్డీవో మధులతను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అధికారులంతా ఒక్కటై మొంథా తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కోగలిగామని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఇది సమష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. ఇదే విధంగా రానున్న కాలంలో ఎలాంటి విపత్తు వచ్చినా కలిసికట్టుగా నిలబడగలగాలని.. అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. తుఫాన్ విధులను సమర్థంగా నిర్వహించిన సిబ్బంది, అధికారులకు అభినందన సభ సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ మెమొంటో, శాలువాతో ఘనంగా 51 మంది అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమర్థ సేవలందించిన అధికారులను ఎల్లప్పుడూ గుర్తుంచుకునేలా.. అన్ని వివరాలను తయారు చేయాలని, దీనిని కలెక్టర్ ఆఫీస్‌లో ఉండేలా ఒక గుర్తుగా, అందరినీ యూనిటీగా చేసేలా ఉంచుతామన్నారు. పని చేసిన అందరినీ ఒకేలా చూసామని, ఇంకొంచెం ఎక్కువగా పని చేసిన వారిని గుర్తించి ఈ సత్కారమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ గుర్తింపు రావడం ద్వారా ఇంకో పనిని ప్రోత్సహించడమే అవుతుందని కృతికా శుక్లా స్పష్టం చేచేశారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొంథా లాంటి తుఫాన్‌లను సమర్థంగా ఎదుర్కొనే అధికారులు, సిబ్బంది పుష్కలంగా ఉన్నారని కొనియాడారు. ఒక్కటిగా తుఫాను బీభత్సాన్ని ఎదుర్కోవడంలో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో పని చేశామని, అందరికీ అభినందనలు తెలిపారు. ఆర్డీవోలు కె.మధులత, వి.మురళీకృష్ణ, జీవీ రమాకాంత్, డీపీవో ఎస్‌వీ నాగేశ్వరనాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ కుంభా ముత్తయ్య, జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.గీతారాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయకుమార్, మున్సిపల్ కమిషనర్లు సి.శ్రీహరిబాబు, ఎం.జస్వంత్, ఎం.సుభాష్ చంద్రబోస్, డి.వేణుబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు, ఎస్‌బీ సీఐ పి.శరత్‌బాబు, బెల్లంకొండ ఎస్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్స్ అల్లూరి చినపుల్లయ్య, ఎం.మల్లికార్జునరావుతో పాటు వివిధ శాఖలకు చెందిన వారిని సత్కరించారు. జేసీ సూరజ్ ధనుంజయ్ డీఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

మెడికోలు ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

● వెస్ట్ జోన్ డీఎస్పీ అరవింద్



డీఎస్పీ అరవింద్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వెస్ట్ జోన్ డీఎస్పీ కె.అరవింద్ హితవు పలికారు. సోమవారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో ర్యాగింగ్ దుష్ఫలితాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ జరిగితే వెంటనే ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్‌లో పాల్గొనే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వైద్య విద్యార్థులు చదువుపై ధ్యాస ఉంచి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి మాట్లాడుడుతూ ర్యాగింగ్‌కు పాల్పడటం దుష్ట సంప్రదాయమని, ఇది అనాగరిక చర్య అని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కొన్ని సార్లు మెడికల్ కాలేజీ నుంచి బహిష్కరణకు కూడా గురవుతారని చెప్పారు. ఈ సందర్భంగా జీఎంసీ తరఫున డీఎస్పీ అరవింద్‌ను ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ ఇంకాస్త 'మెత్తబడాలి'!

(5వ పేజీ తరువాయి)

సీసీఐ బయ్యర్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల రైతులు పత్తిని ఎంత ఆరబెట్టినా అదే తేమ శాతం నమోదు కావడం గమనించదగిన అంశం. ఈ పరిస్థితుల్లో తేమ శాతాన్ని 12 నుంచి 20కి పెంచాలని రైతులు కోరుతున్నారు. ఈ మాత్రం వెసులుబాటు ఇవ్వకపోతే తాము పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పని చేయని కిసాన్ యాప్

సీసీఐ అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ సరిగా పని చేయక పోవడం రైతులకు శాపంగా మారింది. స్లాట్ బుక్ చేసుకోవడం గగనం అయిపోతుందని రైతులు చెబుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం అదే యాప్ ను వాడాలని చెబుతున్నారు.

జీవో నంబరు 843కి తిలోదకాలు

రాష్ట్రంలోని పత్తి రైతులకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 843కి సీసీఐ తిలోదకాలు ఇచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ జీవోలని 23వ నిబంధన ప్రకారం రైతు పత్తిని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు ఉంది. సీసీఐ మాత్రం అందుకు ఒప్పుకోవ డం లేదు. ఏ జిల్లా రైతులు అదే జిల్లాలో, ఏ మండలం రైతులు అదే మం డలంలో పత్తిని విక్రయించాలని సూచిస్తోంది. జీఓను కూడా గుంటూరు లోని సీసీఐ జనరల్ మేనేజర్ పక్కన పెట్టడం దుమారం రేపుతోంది.

సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు క్రస్ట్‌గేట్లను మూసివేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,292, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 41,915 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 41,915 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 42.86 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.86 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 35,360 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17 వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

33 వేల క్యూసెక్కుల వరద

రెంటచింతల,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలోనిలోని సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 1.5 మీటర్లు, ఒక గేట్ మీటర్ మేర ఎత్తి 32,162, టెయిల్ రేస్ ఛానల్ ద్వారా 4,422, మొత్తంగా 36,584 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.4939 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందని తెలిపారు.

నరసరావుపేటలో.. కట్టుతప్పుతున్న టీడీపీ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

విమర్శలున్నాయి.

ఇష్టానుసారంగా నేతల తీరు..

నరసరావుపేట మండలం ములకలూరు చెందిన టీడీపీ నేత మైనార్టీ నేత మహమ్మద్ ఉమర్ మాట్లాడుతూ.. ఎంపీటీసీలను పార్టీకి అనుకూలంగా మార్చే స్థాయిలేని నేతలకు పార్టీలో పెత్తనం ఏంటని ప్రశ్నించారు. సదరు నేతలు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇలానే పనిచేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీలు గెలవగలమా అంటూ నీలదీశారు. గ్రామాలకు వస్తారుగా చూస్తాం.. అంటూ నేతలపై మండిపడ్డారు. పార్టీలోకి వైసీపీ ఎంపీటీసీలను ఆహ్వానించలేని నేతలకు పెత్తనమా అంటూ ప్రశ్నించారు. తను ఇద్దరు ఎంపీటీసీలను పార్టీలోకి తీసుకురాగలిగానని చెప్పారు. పరిస్థితి ఇలానే కొనసాగితే పంచాయతీల్లో ఓటమి తప్పదంటూ భావోద్వేగమైన వీడియో విడుదల చేశారు. అధిష్ఠానం ఇప్పటికైనా కలుగజేసుకొని తప్పులను వెంటనే సరిదిద్దాలని కోరారు. ఎమ్మెల్యేకు తెలియకుండా కొందరు నేతలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

ఇక రొంపిచర్ల మండలంలో కొందరు నేతలు తరచూ వివాదాలకు దిగుతున్నారు. వీరిని కట్టడి చేయడంలో స్థానిక పార్టీ పెద్దలు విఫలమవుతున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడ్డ నేతలను, కార్యకర్తలను గుర్తించడం లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్న అసంతృప్తి పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది జరుగనున్న తరుణంలో ఇలానే వివాదాలు, విభేదాలు కొనసాగితే నష్టం చేకూరు తుందన్న వాదన పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. అసంతృప్తిగా ఉన్న నేతలు, కార్యకర్తలను బుజ్జగించడంతో పాటు, బహిరంగా విమ ర్శలు చేసుకుంటున్న నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే పరిస్థితులు పార్టీలో కానరావడం లేదు.

పిన్నెల్లి సోదరుల.. ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జంట హత్యల కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డి సుప్రీంకోర్టులో దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలో పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. హైకోర్టు తీర్పును ఆగస్టు 31న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, విచారణను ధర్మాసనం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

రేషన్ బియ్యం ఆటో బోల్తా.. ఒకరి మృతి

● పలువురికి గాయాలు

నాదెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటో బోల్తా కొట్టిన ఘటన మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనలో బబూన్ మాలిక్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. ఫిరంగిపురం నుంచి ట్రాలీ ఆటోలో సుమారు 35 బస్తాల బియ్యాన్ని చిలకలూరిపేటకు తరలిస్తున్నారు. నాదెండ్ల గ్రామం దాటిన తరువాత జాలాది సుబ్బయ్య కుంట వద్దకు రాగానే ఆటో టైరు పంక్చరైంది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. ప్రభాత్ మాలిక్, ధైదారి మాలిక్, భీమా సేన్ దాసు, సర్వేశ్వర మాలిక్‌తో పాటు మరొకరు గాయపడ్డారు. వీరిలో కొందరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఎస్ఐ పుల్లారావు ఘటనా స్థలానికి చేరుకొని ఆటోతో పాటు బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకున్నారు.

ఆటోలో నుంచి జారిపడి రెంటాల వాసి మృతి

రెంటచింతల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి జారిపడి మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన పల్లా లక్ష్మయ్య(67) అనే వ్యక్తి మృతిన చెందిన ఘటన సోమవారం జరిగింది. వివరాల మేరకు.. మిర్యాలగూడ నుంచి వస్తున్న లక్ష్మయ్య లక్ష్మీపురం వద్దకు రాగానే ఆటోలో నుంచి జారీ పడ్డాడు. క్షతగాత్రుడ్ని గురజాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతనికి భార్య సీతారావమ్మ, నలుగురు సంతానం. కుమారుడు రామకృష్ణ పాలువాయి వీఆర్వోగా పనిచేస్తున్నారు. లక్ష్మయ్య మృతి పట్ల తహసీల్దారు మేరి కనకం, రాష్ట్ర వీఆర్వోల సంఘ నేత రాజశేఖర్ తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

జ్వరాలపై.. ఇంటింటి సర్వే

సత్తెనపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తరువాత జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్త మైంది. ముందుగానే జ్వరాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించేలా ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఫీవర్ సర్వేను చేపట్టింది. ఆరోగ్య శాఖకు చెందిన ఆశా కార్యకర్త, ఏఎన్ఎం గ్రామాల్లో గృహాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. జ్వరాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. జ్వర లక్షణాలు ఉంటే హెల్త్ యాప్‌లోని సిండోమిక్ ఫాంలో వివరాలను ఏఎన్ఎం అప్‌లోడ్ చేస్తారు. ఒకే ప్రాంతం నుంచి ఐదు జ్వరాల కేసులు నమోదైతే రాష్ట్ర స్థాయి ఆరోగ్య శాఖ అధికారులకు, స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం అందుతుంది. ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆదేశాలు అందాయి. ఆరోగ్య కేంద్రాలకు జ్వరాలతో వచ్చే రోగుల వివరాలను పీ ఫామ్, ఎల్ ఫాంలలో నమోదు చేస్తారు. జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోనున్నారు.

నిశీధిలో మృత్యుఘోష

(5వ పేజీ తరువాయి)

అత్తయ్య, వియ్యపురాలు గాదె రాజు పుష్పవతి(60), మనవడు జయంత్, మనవరాలు వైష్ణవి, బంధువు ముదునూరి శ్రీనివాసరాజు (57) ఉన్నారు. శ్రీనివాసరాజు కారు డ్రైవింగ్ చేస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో కర్లపాలెం పంచాయతీ సత్యవతిపేట వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయి వారి కారు ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బలరామరాజు, లక్ష్మీ, పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరాజు కొన ఊపిరితో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. చిన్నారి వైష్ణవికి కుడి భుజానికి గాయాలు కాగా చీరాలలోని ప్రైవేట్ వైద్యశాలకు, జయంత్ తల, కాళ్లకు గాయాలు కాగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన మూడు నిమిషాల్లోనే మిగిలిన రెండు కార్లు ఘటనా స్థలానికి చేరుకోవడంతో.. బంధువులు బోరున విలపిస్తూ మృతదేహాలను వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై సీఐ హరికృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

37,640 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు సోమవారం 40,415 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,834 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12700
334	10000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15200
273	----	---	నెంబరు. 5	10000	14300
341	10000	15800	273	---	----
4884	---	----	341	10000	16000
సూపర్ 10	----	---	4884	11000	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15200	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

7న బాలనాగేంద్రస్వామి వార్షికోత్సవం

దర్శి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శవరంలో వేంచేసియున్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 7న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాటలు, పద్యాలు, ఏకపాత్రాభినయ పోటీలు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటి సభ్యులు తెలిపారు. వివరాలకు 9949513076, 9908678801 నంబర్లను సంప్రదించాలన్నారు.

దైద అమరలింగేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

గురజాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైదలో వేంచేసియున్న శ్రీఅమరలింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తికమాసంలో 2వ సోమవారం కావడంతో దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో పూర్ణచంద్రరావు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ భాస్కర్ బందోబస్తు నిర్వహించారు.

రైతులకు వంద శాతం సబ్సిడీ ఇవ్వాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐదెకరాలలోపు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలను వంద శాతం సబ్సిడీపై అందించాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాయలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మొంథా తుఫాన్‌తో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గిట్టుబాటు ధరతో పంటను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి రాగి ప్రతాప్‌బాబు, మండల అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లారెడ్డి, బ్రహ్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము కోటేశ్వరరావు, చింతకాయల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయంలో దీపోత్సవం

మాచర్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం దీపోత్సవం నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కంభంపాటి యలమంద, తుమ్మెపల్లి సత్యనారాయణ, షరాబు పాపరావు, పోలిశెట్టి లింగేశ్వరరావు, భవనారి యతేంద్ర, పోలాపద్మ, ఉషారాణి, కుమారి, ధన్యలక్ష్మి, సుధాపావని లు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అచ్చంపేట విద్యార్థులు

అచ్చంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేట జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేశ్ సోమవారం తెలిపారు. కె.అద్దైబాబు (హర్డిల్స్, కబడ్డీ), వి.సునీత (రబ్బీ), హరితేజ, బి. ప్రశాంత్ (రెజ్లింగ్) పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుంచి వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కళాశాలల ఆటల పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

చాగల్లు శివారులో జోరుగా కోడి పందేలు

నకరికల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చాగల్లు నుంచి ఉప్పలపాడు వెళ్ళే రహదారిలో సోమవారం కొందరు వ్యక్తులు ఒక బృందంగా ఏర్పడి కోడి పందేలను నిర్వహించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ పందేలను కొందరి మద్దతుతో నిర్వహిస్తున్నట్టు తెలియ వచ్చింది. ఈ ప్రాంతంలో జరిగే కోడి పందేలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. అంచనా బడ్జెట్ ఆమోదంపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

శివాలయాల్లో పూజలు

సత్తెనపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండో కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామిని సందర్శించి ఆలయ అర్చకులు చదలవాడ సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 24వ వార్డులో ఉన్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ


ల్యాప్‌టాప్‌ను బహూకరిస్తున్న ఎంఎల్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కల్యాణ్

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు ల్యాప్ టాప్‌ను బహూకరించినట్లు ఎంఎల్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కల్యాణ్ చెప్పారు.సోమవారం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఇప్పటి వరకు వివిధ పాఠశాలలకు 32 కంప్యూటర్లను ఉచితంగా అందచేశామని చెప్పారు. స్పోకెన్ ఇంగ్లీషులో ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శారద, టి.వెంకటేశ్వర్లు, సుభాషిణి, నాగరాజు, ఆంజనేయులు నాయక్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ దాచేపల్లి కమిటీ ఎన్నిక

దాచేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి పట్టణంలోని రసూల్ భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. దాచేపల్లి ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా అన్వర్, సహాయ కార్యదర్శులుగా రసూల్, ఆసీఫ్, ఉపాధ్యక్షుడిగా సమీర్, నాగేంద్రబాబును ఎన్నుకున్నారు. సమావేశానికి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విక్రం అధ్యక్షత వహించగా.. జిల్లా కమిటీ సభ్యులు నరేంద్ర, రామ సైదులు తదితరులు పాల్గొన్నారు.

వీరారాధన ఉత్సవాలపై నేడు సమన్వయ సమావేశం

కారంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలపై మంగళవారం గురజాలలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు

నకరికల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలోని భగవాన్ శ్రీ సత్యసాయి లీలా వైభవ్ మందిరంలో సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శత జయంతి వేడుకల్లో భాగంగా పాపభీతి, దైవ ప్రీతి, సంఘ నీతి విశిష్టతను తెలిపారు. పూజా కార్యక్రమాల ఏర్పాట్లను, నిర్వాహణను పాపిశెట్టి వెంకట కృష్ణారావు నిర్వహించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించిన అండర్-16 కబడ్డీ ఎంపికలో స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ బొల్లా గిరిబాబు తెలిపారు. బాలుర విభాగంలో ఈ.చందు, బాలికల విభాగంలో పుష్పలత జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గిరిబాబు తెలిపారు. ఈ నెల 7, 8, 9వ తేదీలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు వీరు హాజరవుతారని ప్రిన్సిపాల్ నరేశ్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు


క్రోసూరు మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

క్రోసూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి అభిషకాలు, ప్రత్యేక పూజలు, దీపారధనలు నిర్వహించారు. విప్పర్ల, అందుకూరు, బాలెమర్రు తదితర గ్రామాల్లో జరిగిన కార్తీక సోమవారం పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కపోతేశ్వర స్వామికి..

నకరికల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేజర్లలో కొలువై ఉన్న గంగా భ్రమరాంభ పార్వతి సమేత కపోతేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పూజా కార్య క్రమాలను ఆలయ అర్చకు స్వామి కొండకావూరి వెంక్రటామయ్య శర్మ నిర్వహించారు.

మాచవరం మండలంలో..

మాచవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం కార్తిక మా స పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆయా గ్రామాల మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర ఆస్వామి దేవాల యానికి మహిళా భక్తులు పోటెత్తిరు. వేమవరం, మాచవరం, పిల్లుట్ల, మల్లవోలు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

దేవాలయాల్లో కార్తీక పూజలు

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక శివాలయాల్లో కార్తీక సోమవారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆల యాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రాలైన గుత్తికొండబిలం, దైద అమరలింగేశ్వరస్వామి, మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన సత్రశాల

రెంటచింతల,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని మల్లికార్జునస్వామి దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రెండో కార్తీక సోమవారం కావడంతో వివిధ మాలలు ధరించిన స్వాములతో పాటు ఇతర భక్తులు స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చారు. రాజస్థాన్ స్వీట్స్ నిర్వాహకులు మఖన్‌సింగ్, చంద్రిక దంపతులు 1250 మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్య,ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డిలు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సత్రశాల : కృష్ణానది తీరంలో అన్నదానం

కంది పంటల పరిశీలన

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పిడుగురాళ్ల మండలంలో దెబ్బతిన్న కంది పంట పొలాలను సోమవారం పిడుగురాళ్ల వ్యవసాయ అధికారి సంధ్యారాణి పరిశీలించారు. అధిక వర్షాలకు పంటలు కాపాడుకునే సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్కాలర్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో జరిగిన సెలక్షన్స్‌లో పట్టణంలోని స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం పాఠశాల డైరెక్టర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎం జగదీష్‌రెడ్డి తెలియజేశారు. బాలికల విభాగంలో కె.రాఘవమ్మ, బాలుర విభాగంలో కె.నాని, ఎం వెంకటఅఖిల్, డి.నరేంద్రరెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 7, 8, 9వ తేదీలలో కర్నూలులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని డైరెక్టర్లు తెలిపారు.

ఓఆర్ఆర్ భూముల వివరాలతో పబ్లికేషన్

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేంద్రంగా చుట్టూ నిర్మించనున్న ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు కావాల్సిన భూమికి సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్‌ను పంచాయితీ కార్యాలయాల వద్ద పబ్లికేషన్ చేశారు. మండల పరిధిలోని ధరణికోట, లింగాపురం గ్రామాల పరిధిలో వెళ్తున్న ఓఆర్ఆర్‌కు 565.87 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. లింగాపురం రెవెన్యూ పరిధిలో 143 సర్వే నెంబర్లలో 97.68 హెక్టార్లు, ధరణికోట రెవెన్యూ పరిధిలో 143 సబ్‌డివిజన్‌లలో 468.19 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. దీనికి సంబంధించి భూ యజమానులు తమ అభిప్రాయాలను ఆర్డీవో కార్యాలయంలో తెలియజేయాల్సి ఉంది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే ఔటర్ రింగ్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.

నేడు పాండురంగ స్వామి కల్యాణం

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అమరావతిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో మంగళవారం రుక్మిణీ సమేత పాండురంగ స్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పరాశరం రామకృష్ణమాచార్యులు తెలిపారు.

హైస్కూల్‌కు హైప్రజర్ క్లీనింగ్ మిషన్ బహూకరణ


75 తాళ్ళూరు హైస్కూల్‌కు క్లీనింగ్ మిషన్‌ను బహూకరిస్తున్న గురవారెడ్డి

పెదకూరపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గుత్తికుండ గురవారెడ్డి హై ప్రజర్ క్లీనింగ్ మిషన్‌ను బహూ కరించారు. సోమవారం దీనిని ఆయన ప్రధానో పాధ్యాయుడు శ్రీనివాసరె డ్డికి అందించారు. స్వచ్ఛాంధ్ర అవార్డుకు పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో ఎంపికై అవార్డును అందుకున్న సందర్భంగా భవిష్యత్తులో హై స్కూల్‌ను పరిశుభ్రంగా ఉంచటానికి ఉపయోగపడే ఈ క్లీనర్‌ను బహూ కరించామని గురవారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, మాజీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దుర్గి జడ్పీ స్కూల్‌లో నైపుణ్య పోటీలు

దుర్గి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పాఠశాలస్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 7వ తేదీన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం హనుమంతురావు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రమాదేవి, కోటేశ్వరరావు, కృష్ణయ్య, కరీం, అబ్దుల్ రహీం, చక్రపాణి, అబ్బాస్ వ్యవహరించారు. ఒకేషనల్ ట్రైనర్స్ గంగరాజు, సీహెచ్ గంగాభవాని, చైతన్య వర్మ మార్కెటింగ్, ఎలక్ట్రానిక్స్, ఎంబ్రాయిడరీ, అల్లికలు, గృహోపకరణాల తయారీపై విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించారు.

జిల్లాస్థాయి పోటీలకు జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు

రెంటచింతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు సెయింట్ జోసఫ్ హైస్కూల్ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో డేగల జేమ్స్, తానుచింతల శ్యామ్‌కుమార్, కె.నాగలక్ష్మి, ఎం గీత, అండర్ 17లో డి.దివ్య, డి.. ధనుష్ స్మైలీలు ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది అభినందించారు.


జిల్లాస్థాయి క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

మిర్చి పొలాలను పరిశీలించిన ఏవో

వెల్దుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకుడుచెట్టు తండా, దావుపల్లిలోని మిర్చి పొలాలను సోమవారం ఏవో బాలాజీ గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట పొలాలో అధిక నీరు నిలబడకుండా జాగ్రత్త వహించాలన్నారు. మిరప పంట ముంపునకు గురై పూర్తిగా నష్టం వాటిల్లితే ఆ పంటను తీసివేసి ప్రత్యామ్నాయ పంటను సాగు చేయాలన్నారు. అధికారులు సూచనలు పాటించాలన్నారు.

బెల్లంకొండ కోట అభివృద్ధికి చర్యలు తీసుకోండి

● ఎంపీకి మండల టీడీపీ నేతల వినతి

బెల్లంకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ కోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ రాష్ట్ర టీడీపీ నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, మరి కొంత మంది టీడీపీ నాయకులు సోమవారం నరసరావుపేట శ్రీ కృష్ణ దేవరాయలుకు విన్నవించారు. సోమవారం


ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలుకు వినతి పత్రం అందజేస్తున్న మండల టీడీపీ నాయకులు

గుంటూరులోని ఎంపీ నివాసంలో ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి అటవీశాఖ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో కోటను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోట అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేసి కమిటీ కన్వీనర్‌గా కల్లి శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీని కలసిన వారిలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల టీడీపీ అధ్యక్షుడు అక్కుల వెంకటరామిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం, తమ్మిశెట్టి సత్యనారాయణ, పీఎస్‌కే రసూల్, డాక్టర్ హనుమంతరావు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కారంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.పద్మావతి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలుకు అధికారులు చేస్తున్న కృషిని, గర్భిణీలు, శిశువుల నమోదు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రమ్య, లక్ష్మీ మౌనిక, మల్లయ్య, ఉషారాణి, శివశంకర్, వెంకటలక్ష్మి, లాలు నాయక్, ధనలక్ష్మి, ఆమని, రమాదేవి, నవీనా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ సాధన కోసం ధర్నా

దుర్గి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ పల్నాడు ప్రాంత ప్రజలు చిరకాల వాంఛ వరికపూడిశెల ప్రాజెక్టును ఐక్యతతోనే సాధించగలమని వరికపూడిశెల జలసాధన సమితి నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన దుర్గి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే వరికపూడిశెల ప్రాజెక్టును చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కౌన్సిల్ సభ్యుడు పోలేపల్లి అబ్రహం లింకన్, వేముల అంకారావు, గణేష్, శాంతప్రసాద్, బత్తుల బాలవీరయ్య, చల్లా మణికుమార్, కాల్వ శివయ్య, చిట్టిప్రోలు అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో మురళీకృష్ణకు ఉత్తమ అధికారి అవార్డు


అవార్డును అందుకుంటున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. మొంథా తుఫాన్ సమయంలో సమర్థవంతంగా పనిచేసినందుకు గాను ఆయనకు ఈ అవార్డు వరించింది. సోమవారం నరసరావుపేటలో కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రం అందుకుంటున్న వీఆర్‌ఏ కోటయ్య

మాచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ వీఆర్వో అనిత, మండలంలోని జమ్మలమడక గ్రామ వీఆర్‌ఏ కోటయ్య ఉత్తమ అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. మొంథా తుఫాన్ సమయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు సోమవారం నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

కపోతేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నా


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కార్తీక రెండో సోమవారం పురస్కరించుకొని ఎమ్మెల్యే కన్నా, టీడీపీ నాయకులు కపోతేశ్వర స్వామిని దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బండి శ్రీనివాసులు, ఆలయ ప్రధాన అర్చక స్వామి కొండకావూరి వెంకట్రామయ్య శర్మ ఎమ్మెల్యేకు శేష వస్త్రాన్ని బహూకరించి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దేవాలయంలో ఆలయ ప్రదక్షిణ చేశారు. అర్చక స్వాములు వేద మంత్రాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, దరువూరి నాగేశ్వరరావు, అట్లూరి శాంతి, అట్లూరి పుల్లమ్మ, సాధు శివ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ మనుగడకే శంకరరావు సుడిగాలి పర్యటన

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి/పెదకూరపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో వరద ముంపు పరిశీలన పేరుతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం చేసిన సుడిగాలి పర్యటన రాజకీయ మనుగడ కోసమేనని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రజల తిరస్కృతికి గురై ఓటమి పాలైన వైసీపీ నాయకులు నేడు రైతుల కోసం పర్యటిస్తుండటం హాస్యాస్పదమన్నారు. రాజకీయ మనుగడ కోసం అబద్ధాలు చెప్పి ప్రజలను పక్కదారి పట్టిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ప్రవీణ్ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హెచ్ఎం సుజాత

మాచర్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ హైస్కూల్ హెచ్ఎం సిస్టర్ తుమ్మ సుజాత తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో మత్తే భూపేంద్రకుమార్, అందుగుల అగస్త్య, తెల్లగొర్ల గణేష్, బాలికల విభాగంలో మత్తే విజయలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 20, 21,22వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. అలాగే అండర్-14 విభాగంలో ఎంపికైన ఇస్వంత్ కుమార్, అజయ్‌కుమార్ ఈ నెల 22, 23, 24 తేదీల్లో పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

మహిళల ప్రపంచకప్ విజయంపై హర్షం


పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న మహిళా నేతలు, కూటమి నేతలు

పిడుగురాళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచకప్ పోటీలో భారత్ మహిళల జట్టు విజయం సాధించడం పట్ల పట్టణ తెలుగు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో భారత జట్టు విజయంపై కేక్‌ను కట్‌చేసి వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల సీత, ఈదర అనురాధ, కొంకా రాధ, యామని పద్మ, తాళ్ల నిర్మల, వున్నం లింగావతి, సామ్రాజ్యం, కృష్ణకుమారి, పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, లెక్కల విష్ణు, వల్లెపు రామకృష్ణ, గోళ్ల కిరణ్, సుతారు మల్లేశ్వరరావు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వెంకటరమణ

మాచర్ల, అక్టోబరు నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ తురకా వెంకటరమణ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో సోమవారం ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు వెంట ఉంచుకోవాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్లో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ వెంట పట్టణ ఎస్ఐ అనంతకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను తొలగించండి


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు సమస్యను వివరిస్తున్న అనంతవరం సర్పంచ్ పిల్లకతుపుల రామయ్య, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు తోక వెంకటరావు

క్రోసూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం గ్రా మంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలపై గుండా ఏర్పాటు చేసిన 33/11కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి కాలనీ వాసుల ఇబ్బందులను తీర్చాలని ఆ గ్రామ సర్పంచ్ పిల్ల కతుపుల రామయ్య గ్రామానికి చెందిన నియోజకవర్గ తెలుగు రైతు అధ్య క్షుడు తోకా వెంకటరావు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలసి సమస్యను వివరించారు. వర్షాలు గాలులు, వచ్చినప్పుడల్లా విద్యుత్ లైన్‌లు ఒక దానికి ఒకటి తగిలి నిప్పులు రాలటం, తరచుగా గృహాలపై వైర్లు తెగి పడ టం వంటివి జరుగుతున్నాయని వారు తెలిపారు. తరుచుగా అగ్ని ప్రమాదా లు కూడా సంభవిస్తున్నాయని తెలిపారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చినట్టు వారు తెలియ జేశారు.

6న ప్లేస్‌మెంట్ డ్రైవ్

నరసరావుపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ, ఆంధ్రప్రదేశ్‌ఓకామ్స్ సంయుక్తంగా ఖతార్‌లోని ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలలో పనిచేయడానికి అనుభవజ్ఞులైన సూపర్‌వైజర్ల కోసం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పురుష అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా, 10 సంవత్సరాల అనుభవం ఉన్నవారు అర్హులని చెప్పారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గొడవలు సృష్టిస్తున్న బొల్లా: టీడీపీ నాయకుల ధ్వజం

వినుకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని టీడీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పోలీసులపై, ప్రజా ప్రతినిధులపై చేసిన నిరాధారమైన ఆరోపణలను ఖండించారు. గత నెల 16వ తేదీన వినకొండ పట్టణంలో జరిగిన వివాహ వేడుకల్లో అభ్యంతరకరంగా ప్రవర్తించిన వారిని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దౌర్జన్యం చేసి వారి విధులకు ఆటంకం కలిగించడం దారుణం అన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకుంటే చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావులపై ఆరోపణలు చేయటం దారుణం అన్నారు. వైసీపీ కార్యకర్తలు చేసిన గొడవను ముస్లిం సమాజానికి ఆపాదించడం దుర్మార్గమన్నారు. దౌర్జన్యాలు దుర్మార్గాలు చేసిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు లాయర్ రామకోటేశ్వరరావు, సైదారావు, షమీంఖాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగవు: బొల్లా

వినుకొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన కార్యకర్తల అరెస్టులు తగదని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బొల్లా మాట్లాడుతూ అక్టోబరు 16వ తేదీన ఓ వివాహ వేడుకల్లో వైసీపీకి చెందిన కొందరు యువకుల తీరుపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జాబీర్‌ను అనే యువకుడిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించారంటూ ఆయన ఆరోపించారు. రషీద్ హత్య కేసులో సాక్షులను భయభ్రాంతులకు గురి చేయడానికి వినుకొండ పట్టణ సీఐ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేయాల్సిన అవసరం నాకు లేదు: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలతో మనుగడ సాగించాల్సిన అవసరం నాకు లేదని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత నెల 17 తారీఖున జరిగిన కాటికాపరి ఎఫ్రాన్ హత్య కేసులో 17 రోజులు పోలీసులు క్షుణంగా దర్యాప్తుచేసి నాగరాజు అనే వ్యక్తి హత్య చేశాడని సాక్షాధారాలతో సహా, వీడియోలతో కలిపి కోర్టుకు హాజరు పరచడం, అతనికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. తమ ప్రమేయం లేని హత్య కేసుల్లో కూడా వైసీపీ చెందిన వారిపై దుష్ప్రచారం చేయడం అరవిందబాబుకు తగదని గోపిరెడ్డి హితవు పలికారు.

డబుల్ రిజిస్ట్రేషన్ చేసి మోసం చేశారని ఎస్పీకి ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గతంలోనే విక్రయించిన పొలానికి తోడు పక్కవారి పొలాన్ని కలిపి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మోసం చేశారని బాధితుడు తేళ్ల వెంకట రామారావు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన యడ్లపాడుకు చెందిన ముత్తవరపు వెంకట్రావు, ఆయన భార్య నాగమల్లేశ్వరి వారి కుమారుడు అజయ్ కుమార్, కూతురు జ్యోతి అలాగే ముత్తవరపు రవి మోహన్లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

క్లుప్తంగా...

● శావల్యాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముఖి మండలస్థాయి సైన్స్ సంబరాలను శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు మండల జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు కేవీఆర్ మోహన్‌చంద్ తెలిపారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా యూనిటీ మార్చ్, ఏక్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం టీడీ శంకరరెడ్డి, డాక్టర్ ఏ సరళాదేవి, డాక్టర్ ఆర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో ఈ నెల 1వ తేదీన నిర్వహించిన 10వ, 1వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ బాలబాలికల స్విమ్మింగ్ పోటీలలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, పల్నాడు జిల్లా జట్టులో డి. అక్బర్ ఆలీ, పి. హస్విత, షణ్ముఖి అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో అభినందించారు.



పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవో మధులత తదితరులు

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 154 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్‌కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● నరసరావుపేట పట్టణంలోని మసీదులో ఇమామ్‌లు, మౌజనులకు 14నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని మాయా బజార్ పెద్ద మసీదు ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అన్నారు. ఈ మేరకు సోమారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్డీ గౌస్ ముక్తి రైస్ అహ్మద్, ఇమామ్ బాష పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళలో త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో పూజారిగా పనిచేస్తున్న కోటా భరత్‌కు న్యాయం చేయాలని కలెక్టర్‌కు గ్రామానికి చెదిన పలువురు విన్నవించారు. గ్రీవెన్స్‌లో వారు వినతి పత్రాన్ని అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా భరత్ ధూప, దీప, నైవేద్యాలు కైంకర్యాలు చేస్తున్నారని వివరించారు. కాగా ప్రభుత్వం ప్రతి నెల ధూప, దీప, నైవేద్యాల కోసం ఇస్తున్న రూ.10వేలను కొల్లిపర పాపారావు వ్యక్తి ఖాతాలో వేస్తున్నారని ఆరోపించారు. ఆ వ్యక్తి ఆ సొమ్మును తన వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటూ భరత్‌కు చెల్లించటం లేదన్నారు. ఇక నుంచి ప్రభుత్వ సాయాన్ని కోటా భరత్‌కు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చుక్కల, ప్రభుత్వ భూములను కాపాడండి

వినుకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మండల రెవెన్యూ పరిధిలో చుక్కలు, ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొని, రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించుకున్న భూ కబ్జాదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ ఆఫీస్‌వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వినుకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50/5-బి1 నుంచి బీ19 వరకు ఆర్ఎస్ఆర్ దాఖల 50ఎకరాలు సబ్ డివిజన్ జరిగి పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, సర్వే నంబర్ 309/4లో రెండు ఎకరాల 30సెంట్లు మొత్తం ఈ భూములన్నింటిని ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్లు వినుకొండ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డుల్లో ఆన్లైన్లో తమ అనుచరుల పేర్లు ఎక్కించుకొని యధేచ్ఛగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా వినుకొండ నియోజకవర్గంలో నూజెండ్ల, దాట్లవారి పాలెం, వెంకుపాలెం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు భూకబ్జాదారుల చేతుల్లో ఉన్నాయని వీటన్నిటికీ స్థానిక రెవెన్యూ యంత్రాంగం అండదండలు ఉన్నాయని ప్రభుత్వం వెంటనే వీటన్నిటిపై తగు విచారణ జరిపి ఈ భూములన్నిటిని స్వాధీనం చేసుకొని భూమిలేని నిరుపేదలకి పంపిణీ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పీడీఎం సీనియర్ నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్ పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని గండిగనుముల సచివాలయంలో సిబ్బంది లేకపోవటం వల్ల గండిగనుమల, దోమలగుండం పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గ్రీవెన్స్‌కు ఏపీ గిరిజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటా నాయక్, పీడీఎఫ్ రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వారు వినతి పత్రం అందజేశారు. ముందుగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లపాటి రామారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రెడ్డిబోయిన ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 100 గృహాలకు సౌర విద్యుత్

నరసరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో వంద గృహాలకు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ అందించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు 10,000 సౌర విద్యుత్ కనెక్షన్లు లక్ష్యం సాధించేందుకు అనేక పరిపాలనా వెసులుబాట్లు కల్పించామన్నారు. బ్యాంకుల ద్వారా 10రోజుల్లో రుణాల మంజూరు, సులభతరంగా విద్యుత్ కనెక్షన్ యజమాని పేరు మార్పులకు అవకాశం ఇచ్చామన్నారు. వెండర్లతో సమన్వయం చేసుకుని ఎక్కువ విద్యుత్ బిల్లు చెల్లిస్తున్న వినియోగదారులకు సౌర విద్యుత్ లాభాలను వివరిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఈఈ, డీఈ, ఏఈ స్థాయిల్లో నెలవారీ లక్ష్యాలు నిర్దేశించి సౌర గృహాల సంఖ్యను పెంచాలన్నారు. జిల్లాలో నూతన సబ్‌స్టేషన్లకు భూములను వెంటనే అందజేయడం జరుగుతుందన్నారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె, సీఆర్‌డీఏ ఎస్ఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్, సోలార్ ప్యానెల్ వెండర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విద్యార్థులకు మెరుగైన విద్య, పోషకాహారం అందించాలి

● ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

యడ్లపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) ఎల్.లింగేశ్వరరెడ్డి సోమవారం యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీచేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, హైస్కూల్ ప్లస్-2 విద్యాబోధన, ప్రగతి అంశాలపై పరిశీలన చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమీక్షించారు. ఇంటర్ చదివే విద్యార్థినులకు అందిస్తున్న బోధన, ప్రగతి అంశాలపై సమీక్షించారు. గ్రేడ్‌ల వారీగా విద్యార్థుల విభజన తీరును పరిశీలించారు. ఆయా గ్రేడ్లకు తగ్గ బోధన ప్రణాళికలు ఎలా ఉన్నాయనే విషయంపై ఆరా తీశారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఎందుకు అమలు చేస్తుందో దాని లక్ష్యాలు ఏమిటో సంబంధిత సిబ్బంది అర్థం చేసుకుని నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. పథకం లక్ష్యాలను, మెనూ వివరాలు అందరికీ తెలిసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భోజనం లేదా కూరల తయారీలో ఏ వస్తువుల్ని ఎంతెంత పరిమాణంలో వేస్తే విద్యార్థులకు మంచి పోషకాలు లభిస్తాయో ఆ వివరాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. పాఠశాలల్లో తరచూ తనిఖీలు కొనసాగుతాయని ఆర్జేడీ తెలిపారు. విద్యాశాఖ రూపొందించిన పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక విధానాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగరత్నం, హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

బాలికల గురుకుల విద్యాలయంలో నీటి సమస్య

నూజెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గుండ్లకమ్మ నదిలోని మోటార్లు పని చేయకపోవటంతో మండలంలోని పాత ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థినులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆరు వందల మంది విద్యార్థులున్న ఈ గురుకుల పాఠశాల హాస్టల్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినుకొండ మునిసిపాలిటీ నుంచి గత మూడు రోజులుగా ప్రతి రోజు పది ట్యాంకర్లకు పైగా నీటిని తరలిస్తున్నారు. త్వరితగతిన గుండ్లకమ్మ నది నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



గురుకుల పాఠశాల సంపులో నీటిని నింపుతున్న వినుకొండ మునిసిపల్ ట్యాంకర్

త్రైతసిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

శావల్యాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని పొట్లూరు, తుమ్మలకుంట, ఉప్పరపాలెం, కొత్తలూరు, శావల్యాపురం గ్రామాల్లో కమిటీ సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. నర్సరావుపేట కమిటీ అధ్యక్షుడు పెద్దారెడ్డి, కమిటీ సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోఛూరి చిన వెంకటేశ్వర్లు, ఒంటెపులి మస్తాన్, కుంచాల చినవెంకయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన కాలువ కట్టను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు తదితరులు

ఎన్ఎస్‌పీ కాలువ గండ్లకు మరమ్మతులు చేయిస్తాం

● ఈఈ శ్రీనివాసరావు

నూజెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావానికి కాలువ కట్టలు దెబ్బతిని కోతకు గురికావటం, గండ్లు పడటం, దెబ్బతిన్న యూటీలకు త్వరితగతిన మరమ్మతులు చేయిస్తామని ఎన్ఎస్‌పీ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేముల మేజరులో వర్షం ప్రభావానికి దెబ్బతిన్న కాలువలను సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ములకలూరు డీసీ నక్కా బుల్లీశ్వరరెడ్డి, ఎన్ఎస్‌పీ డీఈ వెంకట నారాయణ, ఏఈఈ ప్రసన్న కుమార్, తిమ్మాపురం నీటి సంఘం అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 167 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 167ఫిర్యాదులు అందాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన ఆధార్ కార్డు, పాన్ కార్డును ఉపయోగించి లైసెన్స్ పొంది వ్యాపారం చేశారని చిలకలూరిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఖమ్మం వాణిజ్య పనుల శాఖ అధికారి పట్టణంలోని తన బ్యాంక్ అకౌంట్‌ను హోల్డ్‌లో ఉంచారని, తాను స్థలం అమ్మగా వచ్చిన రూ.9లక్షల నగదును బ్యాంకులో వేయగా అవి కూడా నిలిచిపోయాయని తగు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. యడ్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన శరత్‌చంద్ర ప్రసాద్ తన పొలాన్ని అంబడిపూడి పవన్‌కుమార్ శర్మ మధ్యవర్తిగా కొందరికి లీజుకు ఇచ్చానని, పంట చేతికి వచ్చిన అనంతరం నగదు ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అకాడమి నిర్వాహకులు

గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక

నరసరావుపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చరితా డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేసినట్లు అకాడమి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి బాల,బాలికలు పాల్గొన్నట్లు చెప్పారు. కాగా ఎంపికైన జట్టు ఈ నెల 23, 24, 25 తేదీలలో ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డి, చరితా అకాడమి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్‌కు సేవా రత్న పురస్కారం

వినుకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వివిధ సేవ కార్యక్రమాలను గుర్తించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి, హైదరాబాద్ విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్‌కు విశ్వజనని సేవ రత్న పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఈ అవార్డుని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.అనిల్‌రాజ్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌బాబు అందుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న అనిల్




కలెక్టర్ కృతికాశుక్లా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, నూజెండ్ల తహసీల్దార్ రమేష్ కుమార్

అధికారులకు ప్రశంసాపత్రాలు

వినుకొండ టౌన్, చిలకలూరిపేట, నూజెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జనజీవనానికి ఇబ్బందులు లేకుండా, ముంపునకు గురైన ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సరైన సమయంలో సహాయ సహకారాలు అందించటంలో ప్రతిభ చూపిన మునిసిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌కు, చిలకలూరిపేట తహసీల్దారు షేక్ మహమ్మద్ హుస్సేన్, మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, నూజెండ్ల తహసీల్దార్ జీ రమేష్ కుమార్‌కు సోమవారం కలెక్టర్ కృతికాశుక్లా ప్రశంసా పురస్కారం అందజేశారు. నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వాసులకు నూజెండ్ల జడ్పీ హైస్కూలో పునరావాస కేంద్రంలో సేవలందించిన వీఆర్ఏ గౌతమ్, స్వచ్ఛంద కార్యకర్త కే ప్రభుదాసును కూడా ఈ సందర్భంగా అభినందించారు.

వైభవంగా కార్తిక సోమవారం పూజలు

వినుకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తిక సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో దేవాలయాల్లో స్వామిని సందర్శించి ప్రత్యేక పూజల అనంతరం కార్తిక దీపాలను వెలిగించారు. పట్టణంలోని బోసుబొమ్మసెంటర్‌లోని శివాలయంతో పాటు కమటేశ్వరాలయం, మంజునాథ దేవాలయం, లలితాంబిక, శ్రీనివాసనగర్‌లోని శివాలయాలు కిటకిటలాడాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో విప్పర్ల వల్లభేశ్వర స్వామి

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్ల మూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి, కొనకంచివారిపాలెంలోని వీరభద్రేశ్వరస్వామి, సంతగుడిపాడలోని వెంకటేశ్వరస్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు అభిషేకాలు జరిగాయి. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయాల్లో సాయంత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా లింగార్చన

నరసరావుపేట అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా లింగార్చన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● నూజెండ్ల: నూజెండ్ల చెన్నశ కేశవస్వామి దేవాలయం, రవ్వవరం గంగా పార్వతి రామలింగేశ్వరస్వామి, వీ అప్పాపురం కాశీ విశ్వేశ్వర, రవ్వవరం వెంకటేశ్వర జగన్మాత పీఠంలో కార్తిక సోమవారం సందర్భంగా పూజల్లో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుపుపై సంబరాలు

చిలకలూరిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెటర్లు తమ అసమాన ప్రతిభా సామర్థ్యాలతో ప్రపంచ కప్ పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేటలో నియోజకవర్గ తెలుగు మహిళలు సోమవారం వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో జాతీయ పతాకాలు చేతబూని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలు అద్దంకి అనితాభాయి, ప్రధాన కార్యదర్శి యలగాల సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ కూనల ప్రమీల, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ వీక్షణకు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు, తెలుగు మహిళలు

నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొందిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో థియేటర్ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుచేసి వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. క్రీడాభిమానులతో పాటు తాను కూర్చొని మ్యాచ్‌ని వీక్షించారు. ఈ సందర్భంగా ఈ విజయం మహిళలందరికీ స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు.



జాతీయ జెండాతో సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, క్రికెట్ అభిమానులు

వైద్య శిబిరంలో 400మందికి వైద్య పరీక్షలు

నాదెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామంలో కాటూరి వైద్యశాల వారు సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ పెద్ద కందిమళ్ళ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గైనకాలజీ, ఆర్థో, డెంటల్ తదితర విభాగాల్లోని నిష్ణాతులైన వైద్యులు సుమారు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి సహకరించిన ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు టీడీపీ నాయకులు సింగయ్య, రాఘవయ్య, అంతయ్య, జయరాజు, ఖాజా మొహిద్దీన్, రాము, రాజా తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో ఐడీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో ఈ నెల 1, 2 తేదీలలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ అండర్-12, అండర్-14 బాల బాలికల పోటీలలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో 14 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ఐడీపీఎస్ విద్యార్థులు అండర్-12 విభాగంలో మొదటి స్థానం, అండర్ 17 విభాగంలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో సోమవారం అభినందించారు.